ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

శుక్రవారం 16 ఆగస్టు 2024

పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



లక్ష్యాల సాధనకు ప్రణాళిక

స్వాతంత్ర్య సంబరాలతో గురువారం జిల్లా పులకించింది. మువ్వన్నెల రెపరెపలు, జాతీయ జెండా రంగుల అలంకరణలతో పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థలు నూతన శోభను సంతరించుకున్నాయి. చిన్నారుల నుంచి అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధుల వరకు పంద్రాగస్టు పండుగలో పాల్గొన్నారు. దేశభక్తిని చాటుతూ చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేయగా ఆయా కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా ప్రజలు పంద్రాగస్టు పండుగను వేడుకగా జరుపుకున్నారు. వాడవాడలా జాతీయ పతాకాల ఆవిష్కరణలు జరిగాయి. గుంటూరు పరేడ్ గ్రౌండ్‌లో, నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో, బాపట్లలో పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయిలో స్వాతంత్ర్య దినోత్సవాలు అట్టహాసంగా జరిగాయి. గుంటూరులో నారా లోకేశ్, పల్నాడులో నాదెండ్ల మనోహర్, బాపట్లలో గొట్టిపాటి రవి కుమార్‌లు జాతీయ జెండాలను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించి సందేశమిచ్చారు.

- సమర్థంగా సంక్షేమ పథకాల అమలు
- 7,500 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం
- వ్యవసాయ రుణాలు రూ.5,602 కోట్లు పంపిణీ
- ఇండోర్ స్టేడియానికి రూ.4.50 కోట్లు మంజూరు
- స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్

నరసరావుపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్నాం. ప్రగతి లక్ష్యాల సాధనకు వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తాం. వికసిత్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఏటా 15 శాతం అభివృద్ధిని సాధించే దిశగా 2024-29 ప్రణాళిక అమలుకు చర్యలు తీసుకుంటున్నాం.. అని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో గురువారం జిల్లా స్థాయి స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మనోహర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని ఇచ్చారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకువెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. 7,500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం అమలుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. చిలకలూరిపేటకే పరిమితమైన రైతు బజార్లను జిల్లాలోని అన్ని పట్టణాల్లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.13,211 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.5,602 కోట్లు పంపిణీ చేశామన్నారు. గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో రూ.6020.15 కోట్లతో చేపట్టిన మొదటి దశ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. 1,54,454 మంది విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యాకానుక అమలు జరిగిందన్నారు. 2,78,219 మందికి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 1.77 లక్షల కుటుంబాలకు పనిదినాలను కల్పించామన్నారు. జిల్లాలోని 526 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12.67 కోట్లు సర్దుబాటు చేసినట్లు తెలిపారు. నరసరావుపేటలోని క్రీడా ప్రాంగణంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ఖేలో ఇండియా పథకం కింద రూ.4.50 కోట్లు మంజూరయ్యాయన్నారు.

కోలాహలంగా వేడుకలు..

డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో పంద్రాగస్టు వేడుకలు కోలాహలంగా జరిగాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు, పోలీసు జాగిలాల ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాలల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, దేశభక్తితో కూడిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి మనోహర్ సందర్శించారు. స్వతంత్ర సమరయోధులు, వీరజవాన్ల కుటుంబ సభ్యులను మంత్రి సత్కరించారు. త్రివర్ణ బెలూన్లను మంత్రి నాదెండ్ల, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు ఎగురవేశారు. టీడీపీ పార్లమెంటరీ నేత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జేసీ సూరజ్ తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

268 మందికి ప్రశంసా పత్రాలు..

విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను మంత్రి నాదెండ్ల అందజేశారు. 43 మంది జిల్లా, 225 మంది వివిధ స్థాయిల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులు మొత్తం 268 మందికి ప్రశంసా పత్రాలను పంపిణీ చేసి వారిని అభినందించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, స్టాల్స్, శకటాల్లో అత్యుత్తమంగా ఉన్న వాటికి కూడా ప్రశంసా పత్రాలను అందజేశారు.



సత్తెనపల్లి: మునిసిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



వినుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగరవేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



చిలకలూరిపేట: పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగుర వేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, టీడీపీ నాయకులు



పెదకూరపాడు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



నరసరావుపేట: తహసీల్దార్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు





విద్యార్థులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్



ప్రదర్శనలో ఆకట్టుకున్న అటవీ శాఖ శకటం



జాతీయ పతాకం ఆవిష్కరిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, వందనం చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు



పోలీసుల నుండి గౌరవ వందన స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేష్ చిత్రంలో కలెక్టర్, ఐజీ, ఎస్పీ

2047కి.. వికసిత ఆంధ్ర

- గుంటూరు వేడుకల్లో మంత్రి నారా లోకేశ్

గుంటూరు(ఆంధ్రజ్యోతి): దార్శనికతతో పని చేసే చంద్రబాబునాయుడు వికసిత భారత్ 2047 స్ఫూర్తితో వికసిత ఆంధ్రకు రూపకల్పన చేశారని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. గుంటూరులోని పోలీసు పరేడ్‌గ్రౌండ్స్‌లో గురువారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో జెండా ఆవిష్కరించిన అనంతరం లోకేశ్ ప్రసంగించారు. వికసిత ఆంధ్ర లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌ని అక్టోబరు 2వ తేదీకి రూపొందించి మహాత్మాగాంధీ జయంతి రోజున ఆవిష్కరిస్తామన్నారు. జిల్లాలోని అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అమరావతి కోసం కేటాయించిన రూ.15 వేల కోట్లతో రాజధానిలోని ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారికి అత్యవసర చికిత్స చేసేందుకు స్టెమి కార్యక్రమంలో భాగంగా 5 ఆస్పత్రుల్లో రూ.40 వేల ఖరీదైన ఇంజక్షన్లను ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు.



ఇది ప్రజా ప్రభుత్వం

- బాపట్ల వేడుకల్లో మంత్రి గొట్టిపాటి

బాపట్ల(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నది ప్రజా ప్రభుత్వంమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్లలోని పరేడ్‌గ్రౌండ్స్‌లో గురువారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో జెండా ఆవిష్కరించిన అనంతరం రవికుమార్ ప్రసంగించారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును అధికారంలోకి రాగానే రద్దు చేశామన్నారు. జగన్ బొమ్మతో ఉన్న పాసు పుస్తకాల స్థానంలోనే రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తున్నామని చెప్పారు. సమష్టి కృషితో జిల్లాను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామన్నారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య మనువడి భార్య చీరాలకు చెందిన పింగళి రమాదేవిని, స్వాతంత్ర్య సమరయోధుడు యారం అంకయ్య భార్య యాజలి గ్రామానికి చెందిన యారం అన్నమ్మ, ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన మరుప్రోలు జశ్వంత్‌రెడ్డి తల్లి వెంకటేశ్వరమ్మ, తండ్రి శ్రీనివాసరెడ్డిలను మంత్రి సన్మానించారు. వివిధ విభాగాలు ఏర్పాటు చేసిన 17 స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు

బదిలీలకు.. రైట్ రైట్

- నెలాఖరు వరకు నిషేధం సడలింపు
- రేపటి నుంచి వివిధ శాఖల్లో బదిలీల సందడి
- విధివిధానాలను ఖరారు చేసిన సాధారణ పరిపాలనాశాఖ

గుంటూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం జూన్‌లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎప్పుడెప్పుడా అని ఉద్యోగులు ఎదురు చూస్తున్న సాధారణ బదిలీలకు అనుమతి వచ్చింది. ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని నెలాఖరు వరకు సడలిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శుక్రవారం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల్లో బదిలీల సందడి ప్రారంభం కానుంది. జిల్లా స్థాయి అధికారులతో పాటు ఆయా శాఖల్లోని సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, క్లాస్-4 ఉద్యోగులు బదిలీ కానున్నారు. కొత్త జిల్లాలు ఏర్పడినప్పటికి రాష్ట్రపతి గజిట్ పబ్లికేషన్ జరగనందున పాత జిల్లా ఆధారంగా ఎవ్వరినీ సొంత జిల్లాలకు బదిలీ చేయొద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2024 జూలై 31 నాటికి ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలి. ఇతర ఉద్యోగులంతా కూడా పరిపాలన సౌలభ్యం దృష్ట్యా బదిలీలకు అర్హులే. ఒక స్టేషన్ అంటే ఆ జిల్లాలో ఏ హోదాలో ఐదేళ్లుగా కొనసాగుతున్నా బదిలీ చేయాల్సిందే. దృష్టి లోపం ఉన్న ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అలానే గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల కంటే ఎక్కువకాలం విధులు నిర్వహిస్తున్న వారికి కూడా ప్రాధాన్యం ఇస్తారు. 40 శాతం, అంతకంటే ఎక్కువ అంగ వైకల్యం ఉన్న వారికి, బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలున్న వారికి కూడా ప్రాధాన్యం ఉంటుంది. మెడికల్ గ్రౌండ్స్ పైనా బదిలీలకు ప్రయార్టీ ఇస్తారు. వితంతువులు, భార్య, భర్త ఒకే ఊరిలో పని చేసేందుకు అవకాశం కల్పిస్తారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్స్(అధ్యక్షుడు, సెక్రెటరి, ట్రెజరర్)లకు బదిలీ నుంచి మినహాయింపు ఉంటుంది. వీళ్లు మూడు సార్లు తొమ్మిదేళ్ల పాటు ఒక స్టేషన్‌లో కొనసాగవచ్చు. అయితే దీనిని అడ్డం పెట్టుకుని గుర్తింపు లేని సంఘాల నాయకులు కూడా బదిలీల నుంచి మినహాయింపు పొందుతున్నారని ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆఫీసు బేరర్స్ అన్న పదాన్ని ఎవరెవరికి వర్తిస్తుందనేది కూడా నిర్వచించాలని కోరుతున్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ 'ప్రయాస్' పోటీ



న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్&ట్రెయినింగ్(ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్ సైన్స్ అండ్ మేథమెటిక్స్(డీఈఎస్‌ఎం)- 'ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ ఆటిట్యూడ్ ఇన్ యంగ్ అండ్ యాస్పిరింగ్ స్టూడెంట్స్(ప్రయాస్) 2024 స్కీమ్' గైడ్‌లైన్స్ విడుదల చేసింది. విద్యార్థులకు సైన్స్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్, మేథమెటిక్స్ విభాగాల్లో ఆసక్తిని కలిగించి పరిశోధనల దిశగా ప్రోత్సాహాన్ని అందించేందుకు ఈ ప్రోగ్రామ్‌ని ఉద్దేశించారు. ఇందులో భాగంగా విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పరీక్షించి వారి సృజనాత్మకతను పెంపొందించేలా పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తమ ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి శాస్త్రీయంగా పరిశోధనలు చేయాలి. ఇందుకు తమ పాఠశాల ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తీసుకోవచ్చు.

తమ పరిశోధనల వివరాలతో ప్రాజెక్ట్ ప్రపోజల్‌ను సంస్థ ఈ మెయిల్‌కు పంపాలి. ప్రాజెక్ట్ వర్క్ వ్యవధి ఏడాది. అవసరం మేరకు మరో ఆర్నెల్లు పొడిగించే వీలుంది. నిబంధనల ప్రకారం పూర్తిచేసిన ప్రాజెక్ట్ పరిశోధన పత్రాలను ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు.

అర్హత: తొమ్మిది నుంచి పదకొండో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. దరఖాస్తు నాటికి విద్యార్థుల వయసు 14 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఒకరు లేదా ఇద్దరు విద్యార్థుల గ్రూప్ తమ టీచర్, హెచ్‌ఈఐ సహకారంతో రీసెర్చ్ చేయవచ్చు. తొమ్మిది నుంచి పన్నెండోతరగతి వరకు సైన్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్ బోధించే పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) గైడ్‌గా వ్యవహరించవచ్చు. ఒక పాఠశాల నుంచి ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 25
- **దరఖాస్తుల స్క్రీనింగ్:** ఆగస్టు 31
- **ప్రాజెక్ట్ ప్రపోజల్ సెలెక్షన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **జ్యూరీ ఎంపిక చేసిన ప్రాజెక్ట్‌ల సమాచారం:** సెప్టెంబరు 10న
- **ప్రాజెక్ట్ రీసెర్చ్ వర్క్ ప్రారంభం:** సెప్టెంబరు 15 నుంచి
- **ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేసేందుకు చివరి తేదీ:** 2025 సెప్టెంబరు 14
- **ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిషన్:** 2025 సెప్టెంబరు 20
- **ఈ మెయిల్ ఐడీ:** prayaasncert@gmail.com
- **వెబ్‌సైట్:** ncert.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/W6jLfS4లో చదవండి.

దిక్సూచి DIKSUCHI

SCHOLARSHIP ALERT

Corteva Agriscience

Description: An initiative of Corteva Agriscience India Pvt. Ltd., this program aims to provide financial assistance to meritorious students pursuing postgraduate, doctoral or undergraduate courses in the area of agriculture, as well as students in Classes 11 and 12 with STEM subjects.

Eligibility: Female students in postgraduate (MBA/ M.Sc./ M.Tech.), doctoral, or undergraduate courses, as well as for those in Classes 11 and 12 with STEM subjects (government/private schools).

- The applicant's annual family income must be 6,00,000 or less. Students from across India can apply. Children of employees of Corteva & Buddy4Study are not eligible.

Prizes & Rewards:

- For PG students: INR 50,000
- For UG students: INR 25,000
- For school students: INR 10,000

Last Date to Apply: 13-09-2024

Short Url: www.b4s.in/aj/CASP4

Infosys Foundation

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12. The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh. Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 15-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/ISTS2

KSB Scholarship

Description: KSB Ltd through Care Charitable Trust invites applications from female students in their first year of a diploma in engineering or any polytechnic course to provide them with financial support for their studies.

Eligibility: Girls studying in the first year of a diploma in engineering or any polytechnic course. Students studying or having domiciles in and around Pune, Nashik, Ahmednagar, Satara, and Coimbatore. Students who have scored more than 60% marks in their previous classes are eligible to apply. Students' family income from all sources should be less than INR 8 lakh per annum. Children of employees of KSB Care Charitable Trust and Buddy4Study are not eligible.

Prizes & Rewards: Scholarship of INR 25,000 and mentorship support

Last Date to Apply: 16-09-2024

Short Url: www.b4s.in/aj/KSBMP1

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

ఐపీఎస్ ఆఫీసర్‌గా...

విష్వక్ సేన్ కథానాయకుడిగా శ్రీధర్ గంటా దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'వీ.ఎస్ 13' వర్కింగ్ టైటిల్. గురువారం చిత్రీకరణ ప్రారంభించారు. కన్నడ నటి సంపద హీరోయిన్. ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. సెప్టెంబరు నుంచి రెగ్యులర్ షూటింగ్ జరగనుంది. గ్రామీణ నేపథ్యంలో విభిన్న



పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విష్వక్ నిజాయితీ గల ఐ.పీ.ఎస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: కిశోర్‌కుమార్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.



ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్‌లో గౌరవ అతిథిగా పాల్గొనేందుకు ఆహ్వానం అందిన నేపథ్యంలో రామ్‌చరణ్ తన కుటుంబంతో గురువారం మెల్‌బోర్న్ చేరుకున్నారు. పది రోజుల పాటు సాగే ఈ చలనచిత్రోత్సవంలో ఇండియన్ ఆర్ట్స్ అండ్ కల్చర్ అంబాసిడర్ పురస్కారాన్ని రామ్‌చరణ్ అందుకోనున్నారు.

కంటతడి పెట్టించిన కవిత



విలక్షణ నటుడు, గాయకుడిగా సుపరిచితుడైన ఆయుష్మాన్ ఖురానా పశ్చిమ బెంగాల్‌ను కుదిపేస్తున్న ట్రైనీ వైద్యురాలి హత్య ఘటనపై తన కలం ఝుళిపించారు. బాధితురాలి ఆవేదనకు అక్షరరూపం ఇచ్చిన ఆయన ఆ కవితను చదువుతున్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా వైరల్ అయింది. అది విన్న మనసున్న ప్రతి మనిషి కళ్లు ఆర్తితో చెమర్చుతున్నాయి. 'నేనే అబ్బాయిని అయి ఉంటే గది తలుపు వేయకుండా నిద్రపోవచ్చు కదా' అంటూ మొదలైన కవిత మగవాడిగా ఉండడంలోని స్వేచ్ఛను, ఆడపిల్లలపై ఉన్న పరిమితులను వర్ణిస్తూ సాగింది. తన ఆవేదనను ఆయుష్మాన్ ఆవిష్కరించిన తీరుతో ఆ కవిత విన్న ప్రతి ఒక్కరూ ఆ వైద్యురాలి ఆవేదనను అనుభూతి చెందుతున్నారు. 'నిర్భయ హత్య ఘటన జరిగి 12 ఏళ్లు... అయినా మనలో మార్పు రాలేదు. ఇప్పుడు మళ్లీ అదే తరహా ఘటన' అని నటి కరీనా కపూర్ ఆవేదన వ్యక్తం చేశారు. అలియాభట్, ప్రీతిజింతా సహా పలువురు బాలీవుడ్ నటీనటులు ఈ ఘటనను ఖండించారు.

భావోద్వేగాల సమ్మేళనం




బండి సరోజ్‌కుమార్ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'పరాక్రమం'. ఈ నెల 22న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందీప్ కిషన్ మాట్లాడుతూ "సరోజ్ కుమార్ నిజాయితీ గల దర్శకుడు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. "ప్రతీ కామన్ మ్యాన్‌కు కనెక్టయ్యే చిత్రమిది. ఈ సినిమా ఎన్నో భావోద్వేగాల సమ్మేళనం" అని దర్శకుడు బండి సరోజ్‌కుమార్ అన్నారు.



సమంత సమాధానం?

సమంత ఏం చేసినా సంచలనమే. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన సెల్ఫీ చర్చనీయాంశమైంది. ఇది నాగచైతన్య నిశ్చితార్థం తర్వాత ఆమె పోస్ట్ చేసిన తొలి ఫొటో కావడమే అందుకు కారణం. ఇందులో సమంత స్టైలిష్‌గా కనిపించారు. ఈ స్టిల్‌లో సమంత ఎడమ కణతపై మధ్యవేలును ఉంచారు. దర్శకుడు రాజ్ నిడమోరుతో డేటింగ్‌లో ఉన్నారంటూ తనపై వస్తున్న పుకార్లను పట్టించుకోబోనని శామ్ చెప్పకనే చెప్పారని కొందరు నెటిజన్లు అంటున్నారు. 'ది మ్యూజియం ఆఫ్ పీస్ అండ్ క్వైట్' అని రాసున్న టీషర్ట్‌ను సమంత ధరించారు. దీంతో ఈ కొటేషన్ ద్వారా కొందరికి సమంత సరైన సమాధానం చెప్పారని మరో అభిమాని వ్యాఖ్యానించారు.



దసరా బరిలో పొట్టేల్



యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ ఎం. దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి, సురేశ్ కుమార్ సడిగె నిర్మించారు. గురువారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. దసరా సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలుపుతూ పోస్టర్‌ను విడుదల చేశారు.

అక్టోబర్‌లో హారర్ థ్రిల్లర్



వెంకటసాయి గుండ ప్రధాన పాత్రలో నటించిన హాలీవుడ్ చిత్రం 'ద డిజర్వింగ్'. ఈ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌ను కోకా సింగ్ అరోర దర్శకత్వంలో వెంకటసాయి గుండ, తిరుమలేశ్ గుండ్రాత్, విస్మయ్‌కుమార్ కొత్తపల్లి నిర్మించారు. సమాజంలో జరిగే పలు అంశాలను ఆధారం చేసుకుని విభిన్నంగా తెరకెక్కింది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. 'ద డిజర్వింగ్'ను అక్టోబరు 1న విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

బాలల చిత్రం అభినవ్



భీమగాని సుధాకర్ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న బాలల చిత్రం 'అభినవ్'. సమ్మెట గాంధీ, సత్య ఎర్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు. గురువారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "బాలకార్మిక వ్యవస్థను, గంజాయి మాఫియాను నిర్మూలించడమే ఈ సినిమా ప్రధాన కథాంశం. ఇది అందరి ఆదరణ పొందుతుందనే నమ్మకం ఉంది. ప్రేక్షకులను కట్టిపడేసే భావోద్వేగాలు ఈ సినిమాలో ఉన్నాయి. సామాజిక చైతన్యమే ఈ సినిమా ధ్యేయం" అని అన్నారు.

వినాయక చవితికి విడుదల



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'భలే ఉన్నాడే'. ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను జె.శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్.వి.కిరణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి సమర్పిస్తున్నారు. తాజాగా, మేకర్స్ ఈ సినిమా డేట్‌ను ప్రకటించారు. వినాయక చవితి సందర్భంగా ఈ చిత్రాన్ని సెప్టెంబరు 7న విడుదల చేస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది.

జీరోలో హీరోగా



నటుడు శివాజీ రాజా తనయుడు విజయ్‌రాజా హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'జీరో'. ఈ స్పోర్ట్స్ డ్రామాను లక్ష్మీనారాయణ దర్శకత్వంలో ఆర్.లక్ష్మణ రావు, ఆర్.శ్రీను నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తనికెళ్ల భరణి మాట్లాడుతూ "మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది. తప్పక విజయం సాధిస్తుంది" అని చెప్పారు. "అన్ని వర్గాల ప్రేక్షకులకి ఈ సినిమా నచ్చుతుంది" అని దర్శకుడు లక్ష్మీనారాయణ అన్నారు. "ఈ సినిమాలో అందరికీ కనెక్ట్ అయ్యే ఆసక్తికర అంశం ఉంది" అని నిర్మాత ఆర్.లక్ష్మణరావు తెలిపారు.






మంత్రి నారా లోకేశ్‌తో వైదికపై గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు తగిన ప్రాధాన్యం

● గతంలో గ్యాలరీలోనే.. మంత్రి లోకేశ్ ఆదేశాలతో ఈ దఫా వేదిక పైకి

గుంటూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పోలీసు పరేడ్‌గ్రౌండ్స్‌లో స్వాతంత్ర్య వేడుకలు గతంలో జరిగిన ప్రతీసారి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కేవలం వీఐపీ గ్యాలరీలో మాత్రమే కూర్చుని వీక్షించేవారు. అప్పట్లో ఇన్‌చార్జి మంత్రి, అధికారులు ఉండి కూడా వారిని వేదిక పైకి ఆహ్వానించేవారు కాదు. దాంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాసేపు ఉండి వెళ్లిపోయేవారు. ఈ దఫా మాత్రం మంత్రి నారా లోకేశ్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు వేదిక పైన సీట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దాంతో ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, పంచుమర్తి కల్పన, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్‌లు వేదికపై ఆశీనులై మంత్రితో సంభాషించారు.

స్టాల్స్‌ని సందర్శించిన మంత్రి లోకేశ్.. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా వివిధ ప్రభుత్వశాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ని మంత్రి లోకేశ్ సందర్శించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖలు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, ఏపీఎంఐపీ, ఆయుష్, వ్యవసాయం, ఉద్యాన, మత్స్య, పశుసంవర్థక శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా మహిళ స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను, చేనేత వస్త్రాలను మంత్రి లోకేశ్ కొనుగోలు చేశారు. విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు, వీల్‌చైర్స్ అందజేశారు. ఏపీఎంఐపీ ద్వారా స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అలానే స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను, మాజీ సైనికులతో మంత్రి లోకేశ్ ముచ్చటించారు.



ప్రారంభానికి సిద్ధంగా వున్న అన్న క్యాంటీన్

నేడే అన్న క్యాంటీన్ల ప్రారంభం

● రూ.15 రూపాయలకే మూడు పూటలా ఆహారం

గుంటూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం వరకూ ఐదు రూపాయలకే పేదలకు పట్టెడన్నం అందించిన అన్న క్యాంటీన్లు జిల్లాలో తిరిగి ప్రారంభం కాబోతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం గుడివాడలో లాంఛనంగా అన్న క్యాంటీన్ ప్రారంభించారు. తొలి విడతలో ప్రారంభించనున్న 100 క్యాంటీన్లలో మిగిలిన 99 క్యాంటీన్లను శుక్రవారం ప్రారంభిస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలో అన్న క్యాంటీన్లను జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రారంభించనున్నారు.

జోన్ పరిధిలో 39 క్యాంటీన్లు .. గుంటూరుజోన్ పరిధిలో మొత్తం 39 అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపింది. అందులో గుంటూరు నగరం లోనే 8 క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నారు. వాటిలో 7 క్యాంటీన్లు తొలివిడతలోనే ప్రారంభించి పేదలకు ఐదు రూపాయలకే ఆహారం అందించనున్నారు. గుంటూరు పశ్చిమనియోజకవర్గంలోని పల్నాడు బస్టాండు, చుట్టుగుంట, మిర్చియార్డు, తూర్పు నియోజకవర్గంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్దనున్న రైతుబజార్, నల్లచెరువు రిజర్వాయర్ వద్ద, ప్రత్తిపాడు నియోజకవర్గంలోని అడవి తక్కెళ్లపాడులోని డీటీసీ కార్యాలయం వద్ద, నగరాలలోని ఐడీ ఆసుపత్రి వద్ద క్యాంటీన్లు ప్రారంభించనున్నారు. ముందుగా పల్నాడు బస్టాండు వద్దనున్న అన్నక్యాంటీన్‌ను శుక్రవారం ఉదయం 7 గంటలకు ప్రారంభించను న్నారు. వాటితోపాటు మంగళగిరి పాత బస్టాండు, తాడేపల్లి, ఉండవల్లిలోని సీఎం ఇంటి వద్ద, రాష్ట్ర సచివాలయం వద్ద వున్న అన్న క్యాంటీన్లు కూడా అధికారులు ప్రారంభించనున్నారు.

త్యాగధనుల పోరాట ఫలం.. స్వాతంత్ర్యం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ కే.గంగాధరరావు, ఇతర అధికారులు

● స్వాతంత్ర్య పోరాట ఘట్టాలు యువతకు స్ఫూర్తిదాయకం
● సామాజిక ఇబ్బందుల కారణంగానే పేదరికం
● అమరావతి రాజధానితో యువతకు ఉజ్వల భవిష్యత్తు
● ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు
● ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవం

పెదకాకాని, ఆగస్టు 15 :నేడు భారతదేశ స్వేచ్ఛా వాతావరణంలో మనగలుగుతుందంటే దానికి ఎందరో మహానుభావుల త్యాగఫలం ఉందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు తెలిపారు. గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాన్ని ఏఎన్‌యూ పరిపాలనా భవనం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన ఇన్‌చార్జి వీసీ మొదటగా జాతీయ జెండాను ఎగరవేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో మంది, ఎన్నో ఏళ్ల పోరాడిన ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని అన్నారు. ముఖ్యంగా సిపాయిల తిరుగుబాటు, క్విట్ ఇండియా, సహాయ నిరాకరణ, జలియన్ వాలాబాగ్ వంటి ఎన్నో పోరాట ఘట్టాలు చరిత్రలో నిలిచే ఉంటాయని, భావితరాలకు స్ఫూర్తినిస్తుంటాయని అన్నారు. నేడు మన దేశం అన్ని రంగాల్లో ముందుకు దూసుకు పోతుందన్నారు. ప్రస్తుతం పాశ్చాత్య దేశాల్లో యువత సంఖ్య చాలా తక్కువ అని, ఈ పరిస్థితి కారణంగానే ఆయాదేశాలు ఇబ్బందితులు పడుతున్నాయన్నారు రానున్న పదేళ్లలో మనదేశం కూడా అదే పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల ద్వారా యువత మరింత చురుగ్గా వారి లక్ష్యాలను చేరుకుంటూనే, దేశ సమగ్రతను కాపాడేందుకు ముందుకు నడవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మేకిన్ ఇండియా నినాదం మంచి ఫలితాలనిస్తుందన్నారు. వస్తువుల ఎగుమతిలో మనస్థానం మెరుగైందన్నారు. ఐటీ, ఫార్మసీ రంగంలో ఎంతో వృద్ధి సాధించామన్నారు. కొన్నిరకాల సామాజిక ఇబ్బందుల కారణంగానే మనదేశంలో అనేక మంది పేదలున్నారని, ఆయా సామాజిక ఇబ్బందుల సమస్యలను తొలగించినప్పుడే పేదరికాన్ని రూపుమాపకగలమని, అంతవరకు పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో ఆయా వర్గాల అభ్యున్నతి సాధ్యపడుతుందని సూచించారు. ఇద్దరుకుమించి పిల్లలు ఉంటే వారు స్థానిక ఎన్నికలలో పోటీకి అనర్హులు అన్న చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం మార్పులుచేస్తూ తీసుకున్న నిర్ణయం ఎంతో ఆహ్వానించతగినదన్నారు. నూతన రాజధాని అమరావతి నిర్మాణం ద్వారా ఎన్నో ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశాలున్నాయని, అనేక కంపెనీలు ఇక్కడ ప్రారంభం కానున్నాయని అలాగే బ్యాంకింగ్ రంగం, పరిశ్రమల రంగం,సేవల రంగం, ఫార్మసీరంగం, ఐటీ రంగం, నిర్మాణరంగం వంటి వాటిల్లో అపార ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. యువత వాటిని అందిపుచ్చుకొనే విద్య, నైపుణ్యాలను కలిగి ఉండాలన్నారు. జీవిత గమనంలో ఎన్నో ఒడిదొడుకులు ఉంటాయని వాటిని అధిగమించి ముందుకు సాగితేనే జీవిత లక్ష్యాలు నెరవేరుతాయని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రెక్టర్ ప్రొఫెసర్ కే.రత్న షీలా మణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జీ.సింహాచలం, డైరెక్టర్లు, కో-ఆర్డినేటర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాణాలు పణంగా పెట్టి గెలిపించారు

● ప్రతి గ్రామానికి సాగునీరు అందిస్తాం
● వీలైనంత వేగంగా వరికపూడిశెల పూర్తి చేసి చూపిస్తాం
● నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు


మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, వేదికపై ఎమ్మెల్యే జూలకంటి

దుర్గి, ఆగస్టు 15: ఇటీవల ఎన్నికల్లో ప్రజలు ప్రేమతో పాటు ప్రాణాలు సైతం పణంగా పెట్టి తనను, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని గెలిపించారని, అందుకు ప్రతిఫలంగా పల్నాడు ప్రజల కలలను నెరవేర్చుతానని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. గురువారం మండల పరిధిలోని ముటుకూరు గ్రామ సర్పంచ్‌గా దొండపాటి చెన్నయ్య ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బుగ్గవాగు నుంచి మాచర్ల నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తాగునీరు అందిస్తామన్నారు. పల్నాడు ప్రజల కల అయిన వరికపూడిశెలను సాధ్యమైనంత త్వర గా పూర్తిచేసి ప్రజలు రుణం తీర్చుకుంటామన్నారు. గ్రామస్థులు సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాలు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీత సాయిశంకర్, లింగా బ్రహ్మయ్య, తోటకూర శ్రీనివాసరావు, లింగా రమేష్, చిరుమామిళ్ల కృష్ణయ్య, దుగ్గెంపూడి జానకి రామయ్య, పులి హరి, తోటకూర శ్రీనివాసరావు, రుద్రాల రవి, మేకల దాసు, కూటమి నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న డీఆర్ఎం రామకృష్ణ

రైల్ విహార్‌లో స్వాతంత్ర్య వేడుకలు

● గౌరవ వందనం స్వీకరించిన డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు రైల్ విహార్‌లో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ జాతీయ జెండాని ఎగుర వేసి ఆర్‌పీఎఫ్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే శాఖ దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ప్రజలను కలుపుతుందని, అంతేకాకుండా ట్రేడ్, కామర్స్ సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. ఐదేళ్లలో గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టు పూర్తి చేస్తామని, సెప్టెంబరు నుంచి తొలిదశ పనులు కుక్కడం - నడికుడి మధ్యన ప్రారంభిస్తామన్నారు. ఎర్రుబాలెం - కొండపల్లి - అమరావతి - నంబూరు నూతన రైలు మార్గం రూ. 2,047 కోట్లతో నిర్మించేందుకు రైల్వేబోర్డు, నీతి ఆయోగ్ సంస్థలు డీపీఆర్‌ని ఆమోదించాయన్నారు. కార్యక్రమంలో గుంటూరు డివిజన్ ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ ఆశలత, ఏడీఆర్ఎం కే సైమన్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.


రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, ఆగస్టు 15: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు గురువారం ప్రాజెక్ట్ రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. రెండు గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 16200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7518 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,988 క్యూసెక్కులు, రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 16200, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 63,129 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 63,129 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. కాగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లకు జాతీయ జెండా రంగులతో లైట్లను అమర్చారు. రాత్రి వేళ ఇదెంతో ఆకర్షణీయంగా ఉంది.

క్యూఆర్ కోడ్‌తో రైల్వే టిక్కెట్ల కొనుగోలు

● అన్ని రైల్వేస్టేషన్లలో అమలు

గుంటూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే క్రమంలో రైల్వేశాఖ విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకొంది. జనరల్ టిక్కెట్ కౌంటర్లలో ఇప్పటివరకు టిక్కెట్ తీసుకోవాలంటే సరిపడా చిల్లరతో నగదు చెల్లించాలి. బుకింగ్ క్లర్కు వద్ద చిల్లర ఉంటే ఇస్తారు. లేదంటే కాసేపు పక్కన ఉండమంటారు. దీని వలన ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. ఒకపక్క రైలు బయలుదేరే సమయం సమీపిస్తుండటంతో చాలా సందర్భాల్లో చిల్లర వదిలేసి వెళ్లిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో టిక్కెట్ కౌంటర్ల వద్ద క్యూఆర్ కోడ్‌తో పేమెంట్ చేసే పరికరాలను అన్ని రైల్వేస్టేషన్లలో రైల్వేశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని వలన ప్రయాణీకుడు ఏ స్టేషన్‌కి టిక్కెట్ కావాలని చెప్పగానే బుకింగ్ క్లర్కు ఆ వివరాలను సిస్టమ్‌లో ఎంటర్ చేసి క్యూఆర్ కోడ్‌ని జనరేట్ చేస్తారు. ప్రయాణీకుడు తన మొబైల్ ఫోన్ ద్వారా ఏ యూపీఐ యాప్ అయినా వినియోగించి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నగదు చెల్లింపు జరపగానే టిక్కెట్ జనరేట్ అవుతుంది. దానిని బుకింగ్ క్లర్కు ప్రయాణీకుడికి అందజేస్తారు. దీని వలన టిక్కెట్ కౌంటర్లలో చిల్లర సమస్యలు తప్పుతాయని రైల్వే అధికారులు తెలిపారు. ఈవిధానం పారదర్శకతకి మైలురాయిగా నిలుస్తుందని, మాన్యువల్ నగదు చెల్లింపులనుంచి ఉపశమనం కలిగిస్తుందన్నారు.

నేటి నుంచి జోన్ -1కు సాగర్ నీరు..

నకరికల్లు, ఆగస్టు15: నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలోని ఆయకట్టుకు శుక్రవారం నుంచి సాగు నీరు విడుదల చేయనున్నట్టు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు నాగార్జున సాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు కే.రవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పమిడిపాడు బ్రాంచ్ కాలువ మినహా పల్నాడు, గుంటూరు జిల్లాలకు (జోన్-1) నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు.

సెప్టెంబరు మొదటి వారం నుంచి జోన్-2కు..

సాగర్ కుడికాలువ పరిధిలోని జోన్-2లో ఆయకట్టు భూములకు సెప్టెంబరు మొదటివారం నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్టు కే.రవి తెలిపారు. ఈ ఆయకట్టు పరిధిలో ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని రైతులు ఉన్నారన్నారు. రైతులు నారు మళ్ళు, మిర్చి, పత్తి, ఇతర పంటలకు ఈ నీటిని వినియోగించుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా సహకరించాలని కోరారు.

డెంగీ లక్షణాలతో
అంగన్‌వాడీ కార్యకర్త మృతి


లక్ష్మీ (ఫైల్‌ఫొటో)

బాపట్ల, ఆగస్టు 15 : బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీ డెంగీ లక్షణాలతో మృతి చెందారు. అంతర్జాతీయ ఫోటోగ్రాఫర్ అవార్డు గ్రహీత పీవీఎస్.నాగరాజు భార్య లక్ష్మీ మృతి గురించి తెలుసుకున్న ఐసీడీఎస్ సిబ్బంది, రాజకీయపార్టీల నేతలు, ఫోటోగ్రాఫర్లు దిగ్భ్రాంతికి గురయ్యారు. కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమెను గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూండగా ఆరోగ్యం విషమించి గురువారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె మృతి గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నేత అన్నం సతీష్ ప్రభాకర్ ముత్తాయిపాలెం వెళ్ళి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియ జేశారు.

విజృంభిస్తోన్న డయేరియా

● క్రోసూరు మండలం, హసనాబాద్‌లో మొత్తం తొమ్మిది కేసులు..
● ఇంటింటి సర్వే చేపట్టిన వైద్య ఆరోగ్య సిబ్బంది


హసనాబాద్‌లో ఇంటింటి సర్వేలో పాల్గొన్న వైద్య ఆరోగ్య సిబ్బంది

క్రోసూరు, ఆగస్టు 15: క్రోసూరు మండలం హసనాబాద్‌లో డయేరియా విజృంభిస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం మండలంలోని అన్ని గ్రామాల ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్లు, కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఆషా వర్కర్లు విస్తృతంగా ప్రతి ఇంటికి తిరిగి సర్వే నిర్వహించారు. ఇప్పటివరకు గ్రామంలో తొమ్మిది డయేరియా కేసులు నమోదైనట్టు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. విరోచనలు అవుతున్న వారి మూత్ర నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపినట్టు వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్‌సాద్ తెలియ జేశారు. అనుమానితుల వద్ద నుంచి కూడా నమూనాలు సేకరించారు. గ్రామంలోపారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. మురుగు కాలువల్లో ఎబాట్ ద్రావణాన్ని, గ్రామం మొత్తం బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించినట్టు, మూడు చేతిపంపు బోరింగ్‌లను సీజ్ చేసినట్టు వైద్య ఆరోగ్య సిబ్బంది తెలిపారు. తెలిపారు. గ్రామంలోని ప్రైవేట్ మంచి నీటి ప్లాంట్ నుంచి కూడా నీటి నమూనాలు సేకరించి పరీక్షల కోసం పంపినట్టు డాక్టర్ మహమ్మద్‌సాద్ తెలిపారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి పూర్తి సమాచారాన్ని సేకరించినట్టు, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉన్నట్టు ఆయన తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించటానికి అవసరమైన అన్ని రకాల మందులను వైద్యశిబిరంలో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

ప్రపంచ స్థాయి డెయిరీలతో 'సంగం' పోటీ

● చైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), ఆగస్టు15: ప్రపంచ స్థాయి డెయిరీలతో సంగం డెయిరీ పోటీ పడే విధంగా అభివృద్ధి పథంలో పయనిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. వడ్లమూడి సంగం డెయిరీ ఆవరణలో గురువారం 78వ స్వతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. మువ్వన్నెల జాతీయ పతాకాన్ని నరేంద్ర కుమార్ ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ సంగం డెయిరీ అభివృద్ధికి రైతులు, ఉద్యోగులు, కార్మికులు నిరంతరం పాటు పడుతున్నారన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో నూతన శాఖలను ఏర్పాటు చేసి సంగం డెయిరీని విస్తరించేందుకు ప్రత్యక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంగం శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన 750 టన్నుల నాణ్యమైన పశు గ్రాస విత్తనాలను దేశంలోని వివిధ రాష్ట్రాల పాడి రైతులకు నేషనల్ డెయిరీ డెవలెప్‌మెంట్ బోర్డు ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 160 టన్నుల పసు గ్రాస విత్తనాలను పాడి రైతులకు ఉచితంగా అందించామన్నారు. సంగం బ్రాండ్ ద్వారా చిరు ధాన్యాలు కూడా ఎక్కువ మొత్తంలో ఉత్పత్తి చేయటానికి ప్రణాళికలు రూపొందిస్తునట్లు తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తులు రూపొందించి వినియోగదారులకు అందించటం ద్వారా వారి ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్నట్లు చైర్మన్ నరేంద్ర కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంగం డెయిరీ ఎండీ గోపాళకృష్ణన్, పాలకవర్గ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

త్యాగధనులను స్మరించుకోవాలి

● ట్రాన్‌కో ఏఈ పత్తిపాటి మంగయ్య ● ఆర్వీఆర్‌జేసీలో స్వాతంత్ర్య వేడుకలు


మాట్లాడుతున్న పత్తిపాటి మంగయ్య

గుంటూరు (విద్య), ఆగస్టు 15: స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన త్యాగధనులను యువత నిత్యం స్మరించుకోవాలని ట్రాన్‌కో ఏఈ పత్తిపాటి మంగయ్య అన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ కళాశాలలో గురువారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ట్రాన్‌కో పత్తిపాటి మంగయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను దేశాభివృద్ధి వినియోగించాలని కోరారు. జైకిసాన్, జైజవాన్ నినాదాలతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కే.రవీంద్ర, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులతో డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

విద్యార్థులతోనే మార్పు సాధ్యం

● స్వాతంత్ర్య వేడుకల్లో విజ్ఞాన్ వీసీ ఆచార్య పీ. నాగభూషణ్

గుంటూరు (విద్య), ఆగస్టు 15: దేశం అభివృద్ధి చెందాలంటే మార్పు అవసరమని, ఆ మార్పు విద్యార్థులతోనే సాధ్యమని విజ్ఞాన్ యూనివర్శిటీ వీసీ ఆచార్య పీ.నాగభూషణ్ అన్నారు. గురువారం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వీసీ నాగభూషణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలు పెంపొందాలని, రానున్న పదేళ్ళలో దేశం అభివృద్ధి పథాన పయనిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.



విద్యార్థులతో భాష్యం రామకృష్ణ

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

● భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ

గుంటూరు (విద్య),ఆగస్టు15: ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని ఉన్నతంగా ఎదగాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. గురువారం భాష్యం బ్లూమ్స్‌లో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాధన కోసం కృషి చేయాలని సూచించారు. స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన త్యాగధనుల్ని విస్మరించరాదని, వారిని నిత్యం స్మరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జడ్ఈవో వరలక్ష్మీ, ప్రిన్సిపాల్ గిరిజారాణి, కవిత తదితరులు పాల్గొన్నారు. తొలుత భాష్యం రామకృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించి విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


రేంజ్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి

రేంజ్ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు

గుంటూరు, ఆగస్టు 15: గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో గురువారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి జాతీయ పతాకావిష్కరణ చేసి వందన సమర్పణ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో పోరాటం ఫలితంగా స్వాతంత్ర్యం లభించిందని, వారి పోరాటాలు, త్యాగాలను స్మరించుకోవాలన్నారు. అనంతరం కార్యాలయంలోని అధికారులు, సిబ్బందికి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్, ఆర్ఐలు శ్రీనివాసరావు, శ్రీహరిరెడ్డి, బ్రహ్మానందం, మినిస్టరియల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.86 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98, 107, 118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



మండల రెవెన్యూ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

● స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి

మాచర్లటౌన్, ఆగస్టు 15: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం, లైబ్రరీ, మున్సిపల్, మండల పరిషత్, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. బాలికోన్నత పాఠశాలలో బిగ్ హెల్ప్ ఆధ్వర్యాన మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దేశ భక్తిని పెంపొందించుకోవాలన్నారు.

పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పులి హరి, అధికార ప్రతినిధి నక్షత్ర ప్రసాద్ ఆధ్వర్యలో నిర్వహించిన వేడుకల్లో మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయాధికారి శ్రీనివాస కల్యాణ్ జాతీయ జెండాను ఎగురవేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ పచ్చిపోలు ప్రభాకరావు, రూరల్ సీఐ నఫీజ్ బాషా, ఎస్ఐ రాజశేఖర్‌లు జెండా ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో యెనుముల కేశవరెడ్డి, సీనియర్ నేత, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, కొండూరు లెనిన్‌బాబు, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, కజ్జం సైదయ్య, కంభంపాటి అనిల్, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, బాబుఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గి : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఫణీంద్రకుమార్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యేచూరి సునీత సాయిశంకర్, ఎంపీడీవో గుప్త జాతీయ జెండాను ఎగురవేశారు.

రెంటచింతల : మండలంలోని టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఎస్ఈ వెంకటరమణ, మోడల్, కేజీబీవీ, జిల్లా పరిషత్, ఎంపీయూపీ, ఎంపీడీవో, పీహెచ్‌సీ, తహశీల్దార్, మండల ఆర్యవైశ్య సంఘం, పోలీసు స్టేషన్, ఉపాధిహామి, సాగరమాత కళాశాల, పరాశక్తి సిమెంట్స్ ‌సంక్షేమ వసతి గృహాలు, పశు వైద్యశాలలు, గ్రామ పంచాయతీల కార్యాలయాల్లో జెండాను ఎగుర వేశారు. అలాగే చెరువు గట్టు సమీపంలో మొక్కలను నాటారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులను మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గొంటు సుమంత్‌రెడ్డి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

కారంపూడి : కారంపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో టీడీపీ, జనసేనే నేతలు పాల్గొని మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం మొక్కలను నాటారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాదరావు, డిప్యూటి తహసీల్దార్ కీర్తి సుధాస్రవంతి, పోలీస్‌స్టేషన్లో సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్ఐ వాసు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో రవికుమార్, పీహెచ్‌సీలో డాక్టర్ రమ్య జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

వెల్దుర్తి : స్థానిక జిల్లా పరిషత్, హారిక హైస్కూళ్లలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం 200 మీటర్ల జాతీయ పతాకంతో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంజీవరెడ్డి జెండాను ఎగురవేశారు. కార్యక్రమాల్లో డిప్యూటి తహసీల్దార్ నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా సెలార్లలో వ్యాపారాలు

● జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి

సత్తెనపల్లి, ఆగస్టు 15 : పట్టణంలోని మునిసిపల్ చైర్‌పర్సన్ తన ఇంటి సెల్లార్‌ను నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సముదాయంగా మార్చి అద్దెలకు ఇచ్చారని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెల్లార్‌ను వాణిజ్య సముదాయంగా మార్చిన విషయం మునిసిపల్ అధికారులకు తెలియదా? అని ప్రశ్నించారు. ఈ విషయంపై మునిసిపల్ అధికారులు స్పందించి తక్షణమే మునిసిపల్ చైర్‌పర్సన్ చలంచర్ల సెల్లార్లలోని వ్యాపారాలను నిలిపివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కన్నా జోక్యం చేసుకొని పట్టణంలోని అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

భూములు కోల్పోతున్న

రైతులకు న్యాయం చేయాలి

ముప్పాళ్ళ ఆగస్టు 15 : 167 ఏజీ జాతీయ రహదారి నిర్మాణంలో భూసేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ రేటు కంటే బహిరంగ వాస్తవ ధరకు రెట్టింపు ధరను ఇచ్చి న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు గద్దె చలమయ్య అన్నారు. మండలంలోని ఇరుకుపాలెంలో పర్యటించిన ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలకు సీపీఎం నాయకులు, రైతులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ భూములు కోల్పోయే రైతులకు కలెక్టర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి నష్ట పరిహారాన్ని అందజేయాలన్నారు. ల్యాండ్ కన్వర్షన్ జరగని భూములకు పంట పొలాల ధరలను నిర్ణయించటం సరి కాదని, ల్యాండ్ కన్వర్షన్ కాకుండానే భూముల రిజిస్ట్రేషన్ చేశారని, దాని ఆధారంగా నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ సంబందిత విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళి రైతులతో సమావేశం ఏర్పాటు చేయిస్తామని, రైతులకు న్యాయం దక్కేలా చూస్తానని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు పెండ్యాల మహేష్, అవ్వారు ప్రసాదు, పలువురు ముప్పాళ్ళ, సత్తెనపల్లి మండలాల రైతులు ఉన్నారు.

బత్తుల నాగేశ్వరరావుకు ఎంపీ పరామర్శ

ముప్పాళ్ళ, ఆగస్టు 15 : అనారోగ్యంతో బాధ పడుతున్న మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావును ఇరుకుపాలెంలోని ఆయన నివాసంలో ఎంపీ లావుశ్రీ కృష్ణ దేవరాయలు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరంగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీ అన్నారు. గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు కూడా బత్తుల నాగేశ్వరరావును పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందిగా ఉంటే గుంటూరులోని వైద్యశాలకు రావాలన్నారు. ఆయన వెంట నాయకులు గోగినేని కోటేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, ఇరుకుపాలెం సర్పంచ్ దరువూరి సుజాత, శ్రీనివాసరావు, రావిపాటి మధుబాబు, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

పుస్తక పఠనంతో ఎంతో మార్పు

సత్తెనపల్లి, ఆగస్టు 15 : పుస్తక పఠనంత జీవితంలో ఎంతో మార్పు చూడవచ్చని రాష్ట్ర మైనార్టీ కార్పోరేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ జాషువా డానియేలు అన్నారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ కళా క్షేత్రంలో గురువారం చెన్నై బ్యూటీఫుల్ బుక్స్ ఆధ్వర్యంలో క్రైస్తవ పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో విజయ్, డేవిడ్ రాజు, సత్యం, స్వరూప్‌తో పాటు పలువురు పాస్టర్లు పాల్గొన్నారు. ఈనెల 20వ తేదీ వరకు పుస్తక ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. సత్తెనపల్లి పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

టీడీపీలోకి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ?

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని కలిసిన నేతలు

మాచర్లటౌన్, ఆగస్టు 15: వైసీపీకి చెందిన మాచర్ల మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు, పోలూరి నరసింహారావులు టీడీపీలో చేరేందుకు రంగు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. గురువారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గృహంలో టీడీపీ నేతలు, కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యేను కలుసుకున్నారు. త్వరలో తమ వార్డుల్లో చైర్మన్, వైస్ చైర్మన్లు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఇప్పటికే వైసీపీ కౌన్సిలర్లు 14 మంది టీడీపీలో చేరారు. వీరిచేరకతో మున్సిపల్ చైర్మన్ పీఠం టీడీపీ వశం కానుంది.



ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డితో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు

స్వాతంత్ర్య ఫలాలు అందరి హక్కు

● మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత
● రాష్ట్రంలో చంద్రన్నపాలనతో అభివృద్ధి ముందడుగు
● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల,ఆగస్టు15: ఎంతో త్యాగధనులు పోరాట ఫలితంగా సిద్ధించిన స్వాతంత్ర్య ఫలాలు ఈ దేశ ప్రజలందరి హక్కు అని, ఆ హక్కులను పొందుతున్న మనం ఆయా మహనీయులను తప్పక స్మరించుకోవా లని, వారి త్యాగాల పోరాట చరిత్రను భావితరాలకు అందించి స్ఫూర్తినందించాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్వాతంత్ర్య దినోత్స వ కార్యక్రమాల్లో భాగంగా పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయం, స్థానిక జడ్పీ హైస్కూల్లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీతో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు హర్షించే పాలన ప్రారంభమైందన్నారు. విద్యార్థులు భావితరాల భవిష్యత్ అని, అబ్దుల్ కలాం చెప్పినట్లు కలలు కనండి.. వాటిని సాకారం చేసుకునే దిశగా ప్రయత్నిం చాలని విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లోనూ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలలో తహ సీల్దార్ మధుబాబు, డాక్టర్ పున్నం నాగమల్లికార్జునరావు, జడ్పీటీసీ వెంకటకోటయ్య, హైస్కూల్ హెచ్ఎం ధనలక్ష్మీ, సీఐవెంకటరావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సయ్యద్ అమీర్‌అలి, పిల్లి చెన్నారావు, పణితి రవి, వడ్డవల్లి సాంబశివరావు, గండికోట వెంకటే శ్వర్లు, కొమ్మినేని రామచంద్రరావు, ఎల్‌విఆర్, కామిశెట్టి రమేష్, వెంకట్, కాశి, రత్నం పాల్గొన్నారు.

100 అడుగుల ఎత్తైన స్తంభంపై జాతీయజెండా రెపరెపలు



ఆంధ్రా సిమెంట్స్ ఆవరణలో 100 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఎగురవేసిన దృశ్యం

దాచేపల్లి: మండలం గామాలపాడులోని ఆంధ్రా సిమెంట్స్ ఆవరణలో 100 అడుగుల ఎత్తైన స్తంభంపై భారీ జాతీయ జెండాను ఆంధ్రా సిమెంట్స్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఆవిష్కరించారు. తహసీల్దార్, పోలీస్ స్టేషన్, ఎంపీడీవో, రైల్వే స్టేషన్, పోస్టల్‌శాఖ తదితర కార్యాలయాల్లో జాతీయజెండాను ఎగురవేసి మహాత్మాగాంధీ, ఇతర జాతీయ నేతల చిత్రపటాలకు నివాళులర్పించారు. దాచేపల్లి మోడల్ స్కూల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయా కార్యక్రమాలలో దాచేపల్లి తహసీల్దార్ వై.కుటుంబరావు, ఎంపీడీవో శోభారాణి, ఎంఈవో పినాకపాణి, టీడీపీ నేతలు తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ భద్రి, కొప్పుల గిరి, అంబటి శేషగిరిరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

మాచవరం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో గురువారం 78వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచాయతీల్లో ఆయాగ్రామాల సర్పంచ్‌లు, పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్‌లు, పోలీస్‌స్టేసన్‌లో ఎస్ఐ కే.సతీష్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కుటుంబరావు, పీహెచ్‌సీలో డాక్టర్ ప్రసాదరావు, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ పెదమస్తాన్, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో శ్రీధర్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

త్యాగధనుల పుణ్యఫలమే స్వాతంత్ర్యం

● సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
● నియోజకవర్గంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

సత్తెనపల్లి, ఆగస్టు 15: ఎందరో త్యాగధనుల పుణ్యఫలమే స్వాతంత్ర్యమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందేలా రాజ్యాంగాన్ని రచించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మునిసిపల్ కమిషనర్ షమ్మి, చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసీ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ గురునాథబాబు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఏరియా వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చక్రవర్తి జాతీయ పతకాలను ఎగుర వేశారు. పట్టణంలోని అన్ని పాఠశాలల్లో, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

పట్టణంలోని వడ్డవల్లిలో అంకమ్మతల్లి గుడి వద్ద టీడీపీ నేతలు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ల : మదర్సాలో జరిగిన స్వాతంత్ర వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మదర్సా నిర్వాహకులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు.

నకరికల్లు : తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కే.పుల్లారావు, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ చల్లా సురేష్, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయాశాఖల ఉద్యోగులు, ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ చైర్మన్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. చల్లగుండ్ల, రూపెనగుంట్ల గ్రామాల్లోని జెండా ఆవిష్కరణ చేశారు.



ఇనిమెట్ల గ్రామంలో జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నా

రాజుపాలెం: మండలంలోని ఇనిమెట్ల, ఆకులగణపవరం, రెడ్డిగూడెం గ్రామాలలో నిర్వహించిన స్వాతంత్ర వేడుకలలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం భాగంగానే ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకట కోటయ్య, నేతలు పల్లపాటి పెద్దిరాజు, జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య, నాయకులు పలువురు పాల్గొన్నారు.



లాల్‌జాన్‌బాషా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

లాల్‌జాన్‌బాషాకు టీడీపీ నేతల నివాళి

పిడుగురాళ్ల, ఆగస్టు 15: రాజ్యసభ మాజీ సభ్యులు ఎస్ఎం లాల్‌జాన్‌భాషా వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం స్థానిక షాదీఖానాలో నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరై లాల్‌జాన్‌భాషా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా యరపతినేని మాట్లాడుతూ రాజ్యసభ సభ్యునిగా లాల్‌జాన్‌భాషా పల్నాడు ప్రాంతానికి, మైనారిటీలకు అందించిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో షేక్ బాబావలి, సయ్యద్ లమీర్‌అలి, ఫరీద్‌మేస్త్రి, భాషా, టీడీపీ సైదా, సర్దార్, ముజీబ్, కార్ సైదాతో పాటు పలువురు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో గురువారం టీడీపీ నేత లాల్ జాన్‌బాషా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎలినేడి రామస్వామి, సయ్యద్ పెద కరిముల్లా, మస్తాన్‌వలి, నూర్ బాషా జానీ బాబు, అబ్దుల్ నబీ, సయ్యద్ గౌస్, మన్నవ శారదాదేవి, కంభాల వెంకటేశ్వరరావు, పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

సత్తెనపల్లి, ఆగస్టు 15: పట్టణంలోని తాలూకా సెంటర్ వద్దగల అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించనున్నారు. అన్నక్యాంటీన్ పునఃప్రారంభంతో మండలంలోని పలు గ్రామాల నుంచి పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి, కూలీలకు, పేదలకు రూ.5లకే టిఫిన్, రూ. 5 భోజనం లభిస్తుంది. వైసీపీ పాలనలో మూతపడ్డ అన్నక్యాంటీన్ పునఃప్రారంభం కానుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మవారికి శ్రావణ మాస పూజలు

నకరికల్లు, ఆగస్టు 15: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని కుంకలగుంటలో వేంచేసియున్న భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్ర స్వామి దేవాలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్కంఠ వీరభద్రస్వామికి, కాశీ విశ్వేశ్వర స్వామికి అభిషేకాలుచేసి ప్రత్యేకంగా అలంకరించారు. భద్రకాళి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చక స్వామి ముప్పాళ్ళ విశ్వనాథ శాస్త్రి నిర్వహించారు.



విద్యార్థుల మధ్య జాతీయ జెండాతో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

మహనీయుల త్యాగాలను స్మరించుకుందాం

● పెదకూరపాడు శాసన సభ్యుడు భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఆగస్టు 15 : స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుందామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఎమ్మెల్యే ప్రవీణ్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను వినియోగించుకొని విద్యార్థులు ప్రపంచం గర్వించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సమర యోధుల జీవిత చరిత్రను తెలుసుకొని, వారిని నిత్యం స్మరించుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారం అందజేశారు. అలాగే మధ్యాహ్న భోజనానికి అవసరమైన పేట్లను, స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీఎస్ వరప్రసాదు, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, నేతలు భాష్యం ఆంజనేయులు, బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, సర్పంచ్ గుడిపూడి రాజు, తహసీల్దార్ డానియేలు, ఎంపీడీవో నరసింహారావు, ఎంఈవో ప్రసాదరావు, హెచ్ఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ. 1 లక్ష విరాళం ..

పెదకూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రూ. 1 లక్ష విరాళంగా అందించారు. అలాగే హైదరాబాద్ జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ అధినేత, ప్రముఖ సంఘ సేవకులు అత్తోట మురళీ ముకుంద్ రూ.2 లక్షలు విలువ చేసే ఫర్నిచర్, క్రీడా పరికరాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. మాజీ ఎంపీపీ గల్లా బాబూరావు పాఠశాల అభివృద్ధికి రూ.25వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు.

మండలంలోని పోలీసు స్టేషన్, పంచాయతీ కార్యాలయం, బలుసుపాడు, గారపాడు హైస్కూలు వద్ద స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు.

క్రోసూరు : క్రోసూరు మండలంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోను, ప్రభుత్వ కార్యాలయాల్లోను, కళాశాలల్లోను జాతీయ జెండాలు ఎగుర వేశారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల సచివాలయాలు, పంచాయతీలలో స్థానిక నేతలు, అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

బెల్లంకొండ : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.

అచ్చంపేట : తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బీ.శ్రీనివాస్, మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. పోలీసుస్టేషన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోను, స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి.

అమరావతి : ఎందరో త్యాగధనుల ప్రతిఫలమే స్వాతంత్ర్యం అని భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు, ఏపీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాష్టి వీరాంజనేయులు అన్నారు. అమరావతి మండలంలోని పెదమొద్దూరు ఎంపీయూపీ పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 15 : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 70,138 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతుందని ఆయన తెలిపారు.

పల్నాడు వార్తలు



కారంపూడి రోడ్డులోని కాకతీయ సేవా సమితి వసతి గృహంలో జాతీయ జెండా వందనం కార్యక్రమంలో పాల్గొన్న జీవీ, మక్కెన, ఇతర నాయకులు



చిలకలూరిపేట ఏఎంజీ స్కూల్లో విద్యార్థుల మల్లకంబ్ విన్యాసాలు



స్వాతంత్ర్య వేడుకల్లో వినుకొండ గీతమ్స్ విద్యార్థుల సంబరాలు

మహనీయుల త్యాగ ఫలితమే నేటి స్వాతంత్ర్యం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 15: సమర యోధుల త్యాగ ఫలమే నేటి స్వాతంత్ర్యం అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం చిలకలూరిపేటలో 78వ స్వాతంత్ర వేడుకల్లో పాల్గొన్న ప్రత్తిపాటి మునిసిపల్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగుర వేసి ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం, మార్కెట్ సెంటర్, పండరీపురంలోని బీఆర్‌ఐజీ పాఠశాల, తెలుగుదేశం పార్టీ కార్యాలయం, నారాయణ పాఠశాల, మోడరన్ షాపింగ్ కాంప్లెక్స్ కృష్ణ మహల్ సెంటర్, పట్టణంలోని పలు సచివాలయాల వద్ద త్రివర్ణ పతకాలను ఆవిష్కరించి అందరికీ 78వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

వికసిత ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు స్వప్నం

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఆగస్టు 15: రాష్టాన్ని అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపేలా వికసిత ఆంధ్రప్రదేశ్ సాకారమే సీఎం చంద్రబాబు నాయుడు స్వప్నం అని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ జెండాను గురువారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఎగరవేసి, జెండా వందనం స్వీకరించారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్, మహాత్మగాంధీ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కారంపూడి రోడ్డులోని కాకతీయ సేవా సమితి వసతి గృహంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి జాతీయ జెండాను ఎగరవేశారు. ఎస్‌ఎస్సీ కాలనీ ఆవరణలోని గురుకుల పాఠశాల, ప్రభుత్వ వైద్యశాల, టీడీపీ కార్యాలయంలో జాతీయ జెండాలను ఎగరవేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, ఎం.రమేష్, నాగశ్రీను, ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు జాతీయ పతాకాన్ని అవిష్కరించారు. కార్యక్రమంలో జేసీ సూరజ్, డీఆర్వో వినాయకం పాల్గొన్నారు. మునిసిపల్ కార్యాలయంలో శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు జాతీయ పతాకం అవిష్కరించారు. కమిషనర్ రవిచంద్రారెడ్డి కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గుంటూరు రోడ్డులో జాతీయ పతాకం అవిష్కరించారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, జెన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు జాతీయ పతాకం అవిష్కరించారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలో ఘనంగా 78వ స్వాతంత్ర్య వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు టీడీపీ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఆర్‌డీవో కార్యాలయం, ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయం, పట్టణంలో గాంధీబొమ్మ వద్ద, ప్రభుత్వ ఆసుపత్రి, గ్రంథాలయం, టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకలలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకలలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వాతంత్ర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్, బాషా, ప్రవీణ్, ఇమ్మానుయేలు, పూర్ణచంద్రరావు, ఖజా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని వెన్నపూస కాలనీ సమీపంలోని గీతాంజలి పాఠశాలలో పాఠశాల డైరెక్టర్ టి.కిశోర్ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కౌన్సిలర్ లింగమూర్తి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్, ఆగస్టు 15: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో స్వాతంత్ర్య వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్యారేజీల్లో ఏర్పాటుచేసిన జాతీయ జెండాను ఆర్టీసీ డీఎం కోటేశ్వరరావు నాయక్ జెండాను ఆవిష్కరించి, కార్మికులకు స్వీట్లు ప్యాకెట్లు పంపిణీ చేశారు.

● వినుకొండ టౌన్, ఆగస్టు 15: పట్టణంలోని సిద్ధార్థ నగర్‌లోని గీతమ్స్ హైస్కూల్‌లో స్వాతంత్ర్య వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో గురువారం స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు, న్యాయవాది పోట్లూరి సైదారావు జాతీయ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, కొండలు, సిద్ధయ్య, గంధం కోటేశ్వరరావు, బొల్లాపల్లి, ఈపూరు, శావుల్యాపురం, నూజండ్ల మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ జాతీయ జెండాను ఎగరవేశారు. జనసేన పార్టీ కార్యాలయంలో నాగశ్రీను, కారంపూడి రోడ్డులోని జనసేనపార్టీ కార్యాలయంలో ఎన్.శ్రీనివాసరావు జెండా ఎగరవేశారు. అదేవిధంగా బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలు జరుపుకున్నారు.



త్రివర్ణ పతాక అలంకారంలో విప్పర్ల వల్లభేశ్వర స్వామి



మునిసిపల్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

● బొల్లాపల్లి, ఆగస్టు 15: ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ బత్తి రాములు, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఏ సుధాకర్, బండ్లమూడు పోలీసు స్టేషన్ వద్ద ఎస్ఐ ఏ బాలకృష్ణ, మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో, సచివాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు.

త్రివర్ణ పతాక అలంకారంలో వల్లభేశ్వర స్వామి

రొంపిచర్ల: మండలంలోని విప్పర్లలో గంగా పార్వతి సమేత వల్లభేశ్వర స్వామి గురువారం త్రివర్ణ పతాక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చందలూరు పరమేశ్వరరావు స్వామి వారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం త్రివర్ణ పతాక రంగులతో అలంకారం చేశారు. రొంపిచర్ల సచివాలయంలో సర్పంచ్ జయమ్మ, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రవీంద్ర, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గడ్డం బాల నాగమ్మ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అంకారావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి జగన్‌మోహన్ రెడ్డి జెండాలను ఎగుర వేశారు. రొంపిచర్లలోని సెయింట్ ఫిలోమినాస్ పాఠశాల విద్యార్థులు గాంధీజీ, భరతమాత, తెలుగుతల్లి వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో మాథ్యూబాబు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ మేడం జయరామిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు, ప్రభుత్వ పాఠశాళల్లో విద్యా కమిటీ ఛైర్మన్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. జడ్పీ పాఠశాలలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ లగడపాటి వెంకటరావు, సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, పీఎంసీ ఛైర్మన్ ముప్పాళ్ళ శ్రీను, గంగినేని రాధాకృష్ణమూర్తి, లగడపాటి సూరిబాబు, బేతపూడి చిరంజీవి, పాఠశాల హెచ్ఎం బీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా సీతారామపురం డాక్టర్ లక్ష్మయ్య విద్యాసంస్థల్లో డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య జెండాను ఆవిష్కరించారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా జ్యోతి స్కాలర్ షిప్‌లను అందజేశారు. గురువారం పేద ఎస్సీ, ఎస్టీ బాలికలకు వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లోని 5, 6, 7 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున 8, 9, 10 తరగతుల బాలికలకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున మేనేజర్ బీ అజయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అలీషా, బ్యాంక్ సిబ్బంది పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ అజయ్ కుమార్, విద్యా కమిటీ ఛైర్మన్ అన్నెం కృష్ణ, మాజీ విద్యా కమిటీ ఛైర్మన్ బేతపూడి వెంకటేశ్వర్లు, బ్యాంక్ సిబ్బంది కంచర్ల అనూష, అక్షయ్, క్రీస్తురాజ్యం, వెంకటేష్, డీ వసంతరాయ్, ఎస్‌సీఎం బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్ 15: పట్టణంలో న్యాయస్థానం భవనాల ఆవరణలో 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఎదుట న్యాయాధికారి ఎన్ సత్య శ్రీ జాతీయ పతాకం ఆవిష్కరించారు. మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఎదుట నియాధికారి ఆశీర్వాదం పాల్, న్యాయవాద సంఘ కార్యాలయం ఎదుట సంఘ అధ్యక్షుడు నాగేశ్వరావు, స్థానిక ప్రత్యేక శ్రేణి ఉపకార్యాలయంలో పర్యవేక్షణ అధికారి రవికుమార్ జాతీయ పథకం ఆవిష్కరించారు.

చిలకలూరిపేటలో ...

చిలకలూరిపేట ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పట్టణంలో పలుచోట్ల వేడుకలు గురువారం నిర్వహించారు. స్థానిక ఏఎంజీ సేవా సంస్థ ఆవరణలో ఉన్న విద్యా సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ బోర్డు సభ్యులు మోజెస్ జాతీయ జెండా ఎగుర వేశారు. విద్యార్థులు మాల్కమ్ పోల్ విన్యాసాలు, మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ అరుణ్ కుమార్ మహంతి జన్మదిన వేడుకలను కూడా ఈ సందర్భంగా నిర్వహించారు. ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్ కృపాదానం, అబ్రహం శామ్యూల్, దీపక్‌సుకన్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని జవహార్ నవోదయ విద్యాలయంలో సంస్థ ప్రిన్సిపాల్ ఎస్.నరసింహారావు జాతీయ జెండా ఎగురవేశారు. జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తోట రాజా రమేష్ జాతీయ జెండా ఎగుర వేశారు.

● ఏఐవైఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పురుషోత్తమపట్నం శివారులో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో స్వాతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో తాగునీటి క్యాన్‌లను అందజేశారు.

● కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ బేతంచర్ల రామకోటేశ్వరరావుతో కలసి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఎం రాధాకృష్ణ జాతీయ జెండాను ఎగుర వేశారు.

డాక్టర్ కృష్ణ మోహన్‌కు ప్రశంసాపత్రం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన దంత వైద్యుడు పేర్ని కృష్ణ మోహన్ ఉత్తమ సేవలకుగాను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు పట్టణ ప్రముఖులు, రోటరీ క్లబ్ చిలకలూరిపేట సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

● నాదెండ్ల, ఆగస్టు 15: మండల కేంద్రమైన నాదెండ్లలో తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, పోలీసు స్టేషన్ వద్ద ఎస్ఐ జీ పుల్లారావు, పంచాయతీ సచివాలయాల్లో సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, ఉప సర్పంచ్ పాటిబండ్ల రామారావు, కార్యదర్శి మారుతీబాబు, నల్లమోతు హరిబాబు తదితరులు ఆవిష్కరించారు. గణపవరంలో పంచాయతీ వద్ద మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు ఆవిష్కరించగా మాజీ సర్పంచ్ హిమవంతరావు, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు. సాతులూరులో టీడీపీ కార్యాలయం, పంచాయతీల వద్ద పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, ముసుగు శోభారాణిలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. సంక్రాంతిపాడులో ఎక్స్‌సర్వీస్‌మెన్‌లు సాంబశివరావు, బ్రహ్మయ్యలను సన్మానించారు.

ముగ్గురికి సేవా పురస్కారాలు

మండలంలోని ముగ్గురికి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా పురస్కారాలు దక్కాయి. ఉత్తమ ఈవోపీఆర్‌డీగా ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేస్తున్న షేక్ జాకీర్ హుస్సేన్, ఉత్తమ డిప్యూటీ తహసీల్దార్‌గా అనురాధ, ఉత్తమ వీఆర్వోగా అంజిలీదేవిలు ఈ పురస్కారాలు అందుకున్నారు.



శ్రీవివేకానంద పాఠశాల్లో దేశ నాయకుల వేషధారణతో విద్యార్థులు

అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

వినుకొండ, ఆగస్టు 15: స్థానిక దక్షిణం బజార్‌లోని వివేకానంద హైస్కూల్‌లో స్వాతంత్ర్య వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశనాయకులు వేషధారణలో చిన్నారులు అలరించారు. అనంతరం ప్రతిభ కనపరిచిన చిన్నారులకు పాఠశాల డైరెక్టర్ సయ్యద్ ఆరీఫ్ బహుమతులు అందచేశారు.

నరసరావుపేటలో రేపు రాష్ట్రస్థాయి ఆటల పోటీలు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 15: ఉత్తరప్రదేశ్‌కు చెందిన విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ నేతృత్వంలో శనివారం రాష్ట్రస్థాయి ఆటల పోటీలు ఈశ్వర్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో జరుగుతాయని పాఠశాల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బొల్లు సాయిరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 3, 4 తేదీల్లో తెనాలిలో జోనల్ స్థాయిలో ఆటల పోటీలు జరిగాయని తెలిపారు.

ఎంపీడీవోగా మాథ్యూబాబు బాధ్యతల స్వీకారం

రొంపిచర్ల, ఆగస్టు 15: రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయ ఎంపీడీవోగా కే మాథ్యూబాబు గురువారం విధుల్లో చేరారు. ఎన్నికలకు ముందు బాపట్ల జిల్లా జే పంగులూరుకు బదిలీ అయ్యారు. అనంతరం మరలా ఇక్కడకు వచ్చి విధుల్లో చేరినట్టు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా సూపరింటెండెంట్ వెంకట లక్ష్మికుమారి వ్యవహరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రొంపిచర్ల, ఆగస్టు 15: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన నందిగం ప్రభుదాసు (35) గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కొద్దిరోజుల క్రితం విప్పర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

ఆటోను ఢీకొన్న లారీ... ముగ్గురికి గాయాలు

వినుకొండ టౌన్, ఆగస్టు 15: ఆటోను, లారీ ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని బాలాజీ ఎస్టేట్ వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే వినుకొండ నుంచి శ్యావల్యాపురం వెళ్తున్న ఆటోను, నర్సరావుపేట వెళ్తున్న లారీ వెనుకనుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో చెట్టును ఢీని తిరగబడడంతో ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

శావల్యాపురం, ఆగస్టు 15: వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి బ్రిడ్జిపై రెయిలింగ్‌ను ఢీ కొట్టడంతో కారులోని నలుగురు వ్యక్తులకు గాయాలైన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై కనమర్లపూడి సమీపాన గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చీరాలకు చెందిన దేవరకొండ సాయి, మరో ముగ్గురు దేవుని దర్శనానికి గురువారం ఉదయం కారులో శ్రీశైలానికి వెళుతూ కనమర్లపూడి సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి కారు అదుపుతప్పి బ్రిడ్జిపైనున్న రెయిలింగ్‌ను ఢీకొట్టింది. కారులో ఉన్న సాయికి తీవ్రగాయాలు కాగా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

మున్సిపల్ కార్యాలయంలో జెండా పండుగ

వినుకొండ టౌన్, ఆగస్టు 15: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ కృష్ణవేణి, మేనేజర్ శ్రీనివాసరావు పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపుగా అవార్డులు

వినుకొండ టౌన్, ఆగస్టు 15: 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, రాష్ట్ర పౌరసఫరాల శాఖ మంత్రి, నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా వినుకొండ పట్టణ సీఐ శోభన్‌బాబు ఉత్తమ ప్రతిభా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు శోభన్ బాబును అభినందించారు. ఆదేవిధంగా వినుకొండ దేవదాయశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లింగా శివలింగప్రసాద్ ఉత్తమ ఉద్యోగ అవార్డును రాష్ట్ర పౌరసఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా అందుకున్నారు.

ఉత్తమ గ్రంథాలయ అధికారిగా శ్రీనివాసరావు

ఈపూరు, ఆగస్టు 15: నరసరావుపేట కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఈపూరు శాఖా గ్రంథాలయం ఉద్యోగి గంటా శ్రీనివాసరావుకు ఉత్తమ ఉద్యోగి అవార్డు మంత్రి నాదెండ్ల మనోహర్ అందజేశారు.

ఘనంగా మర్రి రాజశేఖర్ జన్మదిన వేడుకలు

చిలకలూరిపేట, ఆగస్టు 15: శాసన మండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆయన అనుచరులు, అభిమానులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సోమేపల్లి వెంకట సుబ్బయ్య, గేరా లింకన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి

బొల్లాపల్లి, ఆగస్టు 15 : పదవ తరగతి పరీక్షల్లో హిందీలో 90కు పైగా మార్కులు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎంఈవో టీ పార్వతి నగదు బహుమతులను గురువారం అందజేశారు. జాతీయ భాష హిందీని ప్రోత్సహించాలనే సంకల్పంతో విద్యార్థులకు హిందీపై ఆసక్తిని పెంపొందించాలనే ఆశయంతో తాను సొంతగా రూ.21వేలు నగదును విద్యార్థులకు అందజేశారు. ఏపీ మోడల్ స్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులకు, జడ్పీ పాఠశాల వెల్లటూరు నుంచి ఐదుగురు విద్యార్థులకు, కేజీబీవీ బొల్లాపల్లి నుంచి ఒకరికి నగదును అందజేశారు. అయా కార్యక్రమాల్లో షేక్ అలీషా, షేక్ అమీనాబేగం తదితర ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు

నూజెండ్ల, ఆగస్టు 15: మండలంలోని సీతారామపురం వెంకటేశ్వర స్వామి కమిటీ హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు రూ.3 లక్షలకు పైగా విలువైన వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించి పాఠశాలకు అప్పగించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శర్మ, రావిళ్ళ శ్రీనివాసరావు, రావూరి వెంకటమల్లేశ్వరరావు, అన్నెం శ్రీనివాసరెడ్డి, కంచుమాటి గురు లింగయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, నామినేని లక్ష్మీప్రసన్న, ఫణిదపు భారతి తదితరులు ఉన్నారు.

లాల్‌జాన్ బాషాకు ఘన నివాళి

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 15: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, దివంగత లాల్‌జాన్‌బాషా 11వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పార్టీకి, ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు.

మహిళకు పాముకాటు

గంటవారిపాలెం (శావల్యాపురం) ఆగస్టు 15: పొలానికి వెళ్ళిన మహిళకు పాము కరచింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గంటవారిపాలెం గ్రామానికి చెందిన పోలూరి పిచ్చమ్మ చిక్కుడు తోటలో కలుపును తీసేందుకు పొలానికి వెళ్ళగా అక్కడ ఆమెను పాము కరిచింది. పక్కనే ఉన్న భర్త వెంకటేశ్వర్లు పిచ్చమ్మను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యంకోసం పిచ్చమ్మను వినుకొండలోనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.